అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో మాట్లాడుతున్న శివ

కేసీఆర్‌కు మంత్రి సురేఖ క్షమాపణ చెప్పాలి

శాయంపేట, అక్టోబర్ 4 : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి రెండు సార్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన కేసీఆర్‌ను ఇంకా బతికే ఉన్నడా? అంటూ అవహేళనగా మాట్లాడిన మంత్రి కొండా సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. శాయంపేటలోని అంబేద్కర్ సెంటర్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాయంపేటకు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొండా సురేఖ చేసిందేమీ లేదని, ప్రస్తుతం నియోజకవర్గాన్నే పోగొట్టారని ఎద్దేవా చేశారు. సురేఖకు రాజకీయ భిక్ష పెట్టిందే కేసీఆర్ అని, టీఆర్ఎస్ నుంచి 2014లో ఎమ్మెల్యేగా గెలిపించింది ఆయనేనని గుర్తు చేశారు. హైడ్రాపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కేసీఆర్, కేటీఆర్‌పై, సినిమా హీరోయిన్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బతుకమ్మ చీరలు పంచాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేయాలన్నారు. మైలారం మాజీ సర్పంచ్ అరికెళ్ల ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండలాధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్, శాయంపేట గ్రామ అధ్యక్షులు గాజె రాజేందర్, నాయకులు కూతాటి రమేశ్, అశోక్, మాజీ సర్పంచ్ అరికిల్ల వీరయ్య పాల్గొన్నారు.

నేడు పబ్లిక్‌గార్డెన్‌లో కవి సమ్మేళనం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : ఈ నెల 2 నుంచి 8 వరకు జరిగే వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా 5న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ టౌన్ హాల్‌లో యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్ట్ (యూఎఫ్‌ఈపీ), ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ (ఓడబ్ల్యూఎల్ఎస్) ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణం, వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్యం అంశాలుగా కవితలు రాయాలన్నారు. జీవవైవిధ్యం–ప్రకృతి పరిరక్షణ ప్రచారంలో భాగస్వాములు కావాలని, యూఎఫ్‌ఈపీ, ఓడబ్ల్యూఎస్ఎల్, తెరసం, అరసం వరంగల్, తెలంగాణ కవుల సంక్షేమ సంఘం కోరారు.

నేడు జిల్లా స్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : ఈ నెల 5న జిల్లా సీనియర్ (బాల–బాలికల) బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియల్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి డోలి సాంబయ్య తెలిపారు. సెలక్షన్‌లో పాల్గొనే క్రీడాకారులు శనివారం సాయంత్రం 4 గంటలకు మైదానంలో తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 83284 49263 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

కాజీపేట, అక్టోబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ చేపపిల్లలను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట 61వ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి చెరువులో 4లక్షల 50వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల పరిరక్షణకు పాటు పడుతున్నదన్నారు. మొదటి దఫాలో 50శాతం చెరువుల్లో చేప పిల్లలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ అధికారి శంకర్ రాథోడ్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి, మత్స్య శాఖ సంఘాల ప్రతినిధి బుస్స మల్లేశం పాల్గొన్నారు.

వడ్డేపల్లి చెరువులో చేపల పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే నాయిని

మత్స్యకార్మికుల సంక్షేమమే ధ్యేయం

శాయంపేట: మత్స్య కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ గండి రాజమౌళి అన్నారు. మండలంలోని చలివాగు ప్రాజెక్టులో శుక్రవారం మరో రూ.12లక్షల విలువైన ఆరు లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివాగు ప్రాజెక్టులో చేపలు పట్టే అవకాశం మత్స్యకారులకే ఉందన్నారు. ఇప్పటికే ఆరు లక్షల చేప పిల్లలు వదిలినట్లు చెప్పారు. పాలకవర్గం తరఫున ఇంకా నాలుగు లక్షలు పోస్తామని చెప్పారు. ఎమ్మెల్యే సహకారం అందించాలని 13 గ్రామాల ముదిరాజ్‌కుటుంబ సభ్యులు కోరుతున్నారన్నారు. వచ్చిన ఆదాయాన్ని ప్రతి ఇంటికి అందేలా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ఐరబోయిన రాజు, ప్రధాన కార్యదర్శి మోరె నరేశ్, డైరెక్టర్లు తిరుపతి, సురేశ్, శ్రీధర్, సదయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, పాల్గొన్న పలు శాఖల అధికారులు

హనుమకొండ, అక్టోబర్ 4 : ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వహించాలన్నారు. కొనుగోలుకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదుల వివరాల నివేదికను అందజేయాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ కమిటీ ఏర్పాటు చేయాలని, సమస్యల పరిష్కారానికి కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు అదనంగా కావాల్సి వస్తే వివరాలను అందజేయాలన్నారు. పేమెంట్ ఆలస్యం కాకుండా అధికారులు డేటా ఎంట్రీ కోసం ఆపరేటర్లను నియమించుకోవాలని సూచించారు. సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయాలని, ప్రతి కేంద్రంలో టోల్ ఫ్రీ నంబర్ తెలిపేలా బ్యానర్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల వద్ద తేమ శాతం కొలవాలని, ప్యాడీ క్లీనర్, తాగునీరు, టెంటు తప్పనిసరిగా ఉండాలన్నారు. 33రకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన వ్యక్తిని నియమించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించాలని ఆర్డీవోలను ఆదేశించారు. సన్నరకానికి ఎర్ర దారం, దొడ్డు రకం ధాన్యం సంచులకు ఆకు పచ్చదారంతో కుట్టు వేయాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, డీఆర్డీవో నాగ పద్మజ, డీసీఎస్‌వో ఉమారాణి, డీఎం మహేందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగంగా చేయండి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనను అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, పురోగతి, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజుకు 20 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అదేరోజు అందజేయాలన్నారు. బృందాల్లో కొందరు ఇటీవల బదిలీ కాగా, వారి స్థానంలో కొత్తవారిని నియమించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, మున్సిపల్, సాగునీటి పారుదల శాఖ అధికారులతో 23 బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా ఎల్‌ఆర్‌ఎస్ నోడల్ అధికారి శంకర్‌కుమార్, కుడా పీవో అజిత్‌రెడ్డి, పరకాల మున్సిపల్ కమిషనర్ నరసింహ, బల్దియా సిటీప్లానర్ రవీంద్ర రాదేకర్ పాల్గొన్నారు.

కుటుంబ వివరాలు పకడ్బందీగా సేకరించాలి

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ సర్వేను కలెక్టర్ పరిశీంచారు. సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక కార్డు అనేక ప్రయోజనాలు అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ యూనిక్ కార్డు ప్రజల సంక్షేమం కోసమని అన్నారు. అధికారులు కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారాన్ని పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లలితాదేవి, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, తహసీల్దార్ భాస్కర్, సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్, ఎంపీడీవో పెద్ది ఆంజేయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, అక్టోబర్ 4 : తెలంగాణలో పేద ప్రజల సంక్షేమం కోసం పూర్తి భరోసా ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన 50మంది లబ్ధిదారులకు రూ.16లక్షల 34వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్సకు అవసరమైన ఆర్థికసాయం అందిస్తోందని పేర్కొన్నారు.

'పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి శ్రీరామరక్ష

మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చెన్నం మధు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రతిఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ ఆధ్వర్యంలో 6వ డివిజన్ బొక్కలగడ్డలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. బీపీ, షుగర్ పేషెంట్స్‌కు టెస్టులు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గీత, మెడికల్ ఆఫీసర్ బాజిలీసమ్మ, ఏఎన్ఎం సంధ్య, ఆశవర్కర్లు రషీదా, యాదలక్ష్మి, మౌనిక, నర్వేందర్‌కౌర్ పాల్గొన్నారు.

యువజన సంఘానికి సౌండ్‌బాక్సుల బహూకరణ

శాయంపేట, అక్టోబర్ 4 : మండలంలోని తహరాపూర్ యువ చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా, మాజీ ఉప సర్పంచ్ కుక్కల భిక్షపతి యువ చైతన్య గ్రూప్‌కు రూ.40వేల విలువైన సౌండ్‌బాక్సులను శుక్రవారం బహూకరించారు. మాజీ సర్పంచ్ జిన్నా రాజేందర్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రేణికుంట్ల సదయ్య, మాజీ ఎంపీటీసీ నిమ్మల రమేశ్, పున్నం పురుషోత్తంరెడ్డి, పూజారి కొమురయ్య పాల్గొన్నారు.

యూత్ నాయకులకు సౌండ్‌బాక్సులు బహూకరిస్తున్న భిక్షపతి

అమ్మ ఆదర్శ కమిటీలు పనులను ప్రారంభించాలి

శాయంపేట, అక్టోబర్ 4 : ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన సివిల్ పనులను అమ్మ ఆదర్శ కమిటీలు త్వరగా ప్రారంభించాలని టీఎస్ఈడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఇంజినీర్ రవీందర్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలకు తాగునీరు, విద్యుత్, ఫ్లోరింగ్ మరమ్మతులు పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం డీఎంఎఫ్‌టీ నుంచి రూ.6.25లక్షలను కలెక్టర్ అడ్వాన్స్‌గా మంజూరు చేశారన్నారు. వీలైనంత త్వరగా జాప్యం లేకుండా పనులు చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారి రాజమణి, ఎంపీడీవో ఫణిచంద్ర, ఎంపీవో రంజిత్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలలో ఏఏపీ సభ్యులతో మాట్లాడుతున్న డీఈ రవీందర్

'తీసుకునే ఆహారం ఆధారంగానే ఆరోగ్యం'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : మనం తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని లోడీ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి అన్నారు. మిల్లెట్స్‌పై కొన్నేళ్లుగా త్రినగరి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న 'రికార్డ్ సర్వీస్ సొసైటీ' ఆధ్వర్యం లో ప్రజల సౌకర్యార్థం కుమార్‌పల్లి మార్కెట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన రికార్డ్ మిల్లెట్ హబ్ ఔట్‌లెట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను ప్రతిరోజు ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. నిర్వాహకుడు, మిల్లెట్ కల్టివేటర్ కుసుమ సురేశ్, మిల్లెట్ కుకింగ్ ఎక్స్‌పర్ట్ కుసుమ కవిత మాట్లాడుతూ.. ప్రజలకు చిరుధాన్యాలపై పూర్తి అవగాహన కల్పించడానికి తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని, ఈ విక్రయశాలలో అన్ని రకాల చిరుధాన్యాల ఉత్పత్తులు లభ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమం లో మిల్లెట్ ప్రమోటర్, ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, ప్రకాశ్, శ్రీవాత్సవ్, శ్రీహర్షిత పాల్గొన్నారు.

మిల్లెట్ హబ్ ఔట్‌లెట్ ప్రారంభిస్తున్న ఫాదర్ ఇన్నారెడ్డి

448 మంది డీఎస్సీ అభ్యర్థులకు 310 హాజరు

నేడు సర్టిఫికెట్ల పరిశీలనకు చివరి రోజు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం టీఆర్టీ–2024 ఫలితాలను వెలువరించిన సందర్భంగా హైదరాబాద్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు నియామకానికి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల వివరాలను వెల్లడించి ఈ నెల 1 నుంచి 5 వరకు వారి ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు డీఈవో వాసంతి తెలిపారు. మొత్తం 448 మంది అభ్యర్థులకు 310 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. శనివారం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు చివరి రోజు అని, హాజరుకాలేని వారు నిజ ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్స్ జిరాక్స్ పత్రాలతో సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు డీఎస్సీ–2008 అభ్యర్థులకు చివరి రోజు

హనుమకొండ చౌరస్తా: డీఎస్సీ–2008 బీఈడీ ఏజెన్సీ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో పాఠశాలలో సేవలందించటానికి అనుమతిస్తూ దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈవో వాసంతి తెలిపారు. ఈ నెల 5న ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులు తమ నిజ ధ్రువీకరణ పత్రాలు, 2 సెట్స్ జిరాక్స్ పత్రాలతో హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరుకావాలని ఆమె కోరారు.

'రాజ్యాంగ రక్షణకు కేవీపీఎస్ మరో పోరాటం'

కాజీపేట, అక్టోబర్ 4 : దళితుల సమస్యలు, హక్కుల సాధన కోసం పోరాడుతున్న కేవీపీఎస్ రాజ్యాంగాన్ని రక్షించేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని కుల వివక్ష పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కారు ఉపేందర్ పిలుపునిచ్చారు. కాజీపేటలో కేవీపీఎస్ 26వ వార్షికోత్సవ సభ శుక్రవారం సంఘం మండలాధ్యక్షుడు గడ్డం అశోక్ అధ్యక్షతన జరిగింది. ఉపేందర్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న కుల దురహంకార హత్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆ వర్గాలకే ఖర్చు చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నదన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, నాయకులు ఆకునూరి విజయ్, పోలెపాక రాజు, మిట్టపల్లి రాజమణి, కుడి సామి, రాజాసింగ్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను కొనసాగించాలి

ఐనవోలు, అక్టోబర్ 4 : ఎస్సీ హాస్టల్‌ను కొనసాగించాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని డీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాన్ని ఇప్పటికే సగం వరకు తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించారు. మిగిలిన సగాన్ని ఎంపీడీవో కార్యాలయానికి కేటాయిస్తే మండలానికి కేటాయించిన హాస్టల్ రద్దు అవుతుందన్నారు. ఎస్సీ హాస్టల్‌ను రద్దు కాకుండా కొనసాగించాలని కోరారు. అదనపు కలెక్టర్ కలిసిన వారిలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్, ఉపాధ్యక్షులు ఠాగూర్, విష్ణు, ఎల్లస్వామి, మండలాధ్యక్షుడు కొత్తూరు ప్రవీణ్, కమిటీ సభ్యులు జయపాల్, వంశీ, కుమారస్వామి, బాబు, కొండేటి దిలీప్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

సుబేదారి, అక్టోబర్ 4 : జీవితంపై విరక్తి చెందిన హనుమకొండ హంటర్‌రోడ్డు సమీపంలోని రైలు పట్టాలపై శుక్రవారం ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించిన ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన వ్యక్తిని బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ చిరంజీవిరెడ్డి కాపాడారు. ఆ వ్యక్తి రైలు పట్టాలపై ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి వెంటనే 100కు కాల్ చేశారు. కానిస్టేబుల్ చిరంజీవిరెడ్డి వెంటనే అక్కడికి చేరుకొని అతడిని కాపాడారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు కానిస్టేబుల్‌ను అభినందించారు.

గుట్కా విక్రయదారుల అరెస్టు

మడికొండ, అక్టోబర్ 4 : గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని మడికొండ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండలో పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బందికి ద్విచక్ర వాహనంపై రెండు సంచుల్లో గుట్కా, అంబర్ ప్యాకెట్లు తరలిస్తూ మోదె సోమనాథం పట్టుబడ్డాడు. అతని వద్ద రూ.21 వేలు విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎల్కుర్తి క్రాస్ వద్ద రింగ్ రోడ్డుపై ఉన్న హోటల్లో గుట్కా, అంబర్ విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బంది తనిఖీలు చేశారు. రూ.5,500లు విలువైన అంబర్, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితుడు గబ్బెట రమేశ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

అండర్-19 క్రికెట్ ఫైనల్‌లో మహబూబ్‌నగర్, కరీంనగర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ కేంద్రంగా జరుగుతున్న అండర్–19 అంతర్ జిల్లా పోటీల్లో మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు ఫైనల్‌కు చేరాయి. కోమటిపల్లి క్రీడామైదానంలో కరీంనగర్, నల్లగొండ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ను హెచ్‌సీఏ సీఈవో హైకోర్టు ఉత్తర్వు ప్రకారం రద్దు చేసి కరీంనగర్ జట్టు గెలిచినట్లు ప్రకటించారని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. మొగిలిచర్ల క్రీడా మైదానంలో జరిగిన సెమీస్ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 60 పరుగుల తేడాతో ఖమ్మం జట్టుపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేయగా అబ్దుల్ 110 పరుగులు, సాహిల్ 45 పరుగులతో రాణించారు. ఖమ్మం జట్టు 39.3 ఓవర్లు ఎదుర్కొని 174 పరుగులకు ఆలౌట్ అయింది. నేడు మొగిలిచర్ల మైదానంలో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్–కరీంనగర్ జట్లు తలపడనున్నాయి.

కుటుంబ వ్యవస్థ బలోపేతానికి 'సర్వోదయ' కృషి

ఆత్మకూరు, అక్టోబర్ 4 : కుటుంబ వ్యవస్థ బలోపేతానికి సర్వోదయ సంస్థ కృషి చేస్తుందని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి, డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శుక్రవారం పెద్దాపురంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల నాయకులకు లింగాధారిత హింస నివారణ–మహిళల రక్షణ వ్యవస్థల అనుసంధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలు సంతోషంగా ఉంటేనే సమాజంలో శాంతి, పరస్పర సేవాభావం కల్గి ఉంటుందన్నారు. సోషల్ మీడియా ప్రభావంతో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. యువత ఫోన్లను తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఎలుకటి రజిత మాట్లాడుతూ.. సర్వోదయ సంస్థ ఇప్పటి వరకు 27వేల కుటుంబాల సమస్యలను పరిష్కరించిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, ఆత్మకూరు ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్, వీవోఏ కవిత, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, సీఏలు జయ, వెన్నల, శ్రీవిద్య, సురేశ్ పాల్గొన్నారు.

పెద్దాపురంలో మాట్లాడుతున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

బల్దియా సీఎంహెచ్‌వోగా రాజిరెడ్డి

రాజిరెడ్డి, సీఎంహెచ్‌వో

వరంగల్, సెప్టెంబర్ 4 : గ్రేటర్ కార్పొరేషన్ చీఫ్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ రాజిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ ఆయుష్ శాఖ నుంచి బదిలీపై ఆయన బల్దియా సీఎంహెచ్‌వోగా వచ్చారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. గతంలో ఆయన బల్దియా సీఎంహెచ్‌వోగా పనిచేశారు. రాజిరెడ్డిని బల్దియా ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ అధ్యక్షులు పుల్లా రమేశ్, ప్రధాన కార్యదర్శి దేవేంద్ర ప్రసాద్, బైరబోయిన గట్టయ్య, శ్రీకాంత్, సంపత్, పైడయ్య, రాజేందర్, స్వామి ఉన్నారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

శాయంపేట, అక్టోబర్ 4 : దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన మిర్యాల నరేశ్‌పై బందెల శ్రీకాంత్, గడ్డం కుమార్, గడ్డం రాజేశ్వర్, గడ్డం చరణ్, గడ్డం మహేశ్వరి గురువారం రాత్రి దాడి చేసినట్లు తెలిపారు. గడ్డం చరణ్ నరేశ్‌పై కత్తితో దాడి చేసినట్లు చెప్పారు. దీంతో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

కూతురిని చంపిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పోలీస్ స్టేషన్ ముందు మాట్లాడుతున్న బాధితులు భూక్యా సమ్మయ్య, సత్తమ్మ దంపతులు

వేలేరు, అక్టోబర్ 4 : ప్రేమ పేరుతో తమ బిడ్డను లొంగతీసుకుని గర్భవతిని చేసి చిత్రహింసలు పెట్టి చంపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన భూక్యా సమ్మయ్య–సత్తమ్మ దంపతుల రెండో కూతురు మౌనికను సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ లక్ష్మణ్ ప్రేమించి పెళ్లి చేసుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆరోపించారు. ఈ విషయంపై నెల రోజుల క్రితం వేలేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అధికారులు న్యాయం చేస్తామని చెప్పి జాప్యం చేస్తున్నారన్నారు. నిందితులపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా రేపు, ఎల్లుండి అంటూ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌనిక మృతికి కారణమైన లక్ష్మణ్, రంగా, మాలీ, గుగులోత్ రాజు, ఎర్రబెల్లికి చెందిన భూక్యా సాంబరాజు, నిర్మల, అరుణపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

రేపు పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు

హనుమకొండ, అక్టోబర్ 4 : తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, పీఆర్ఎస్‌డి డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం హనుమకొండ (వరంగల్ అర్బన్) జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 24 పోస్టులకు ఓటింగ్ జరుగుతుందన్నారు. వీటిలో ఒక ప్రెసిడెంట్, ఒక అసోసియేట్ ప్రెసిడెంట్, మూడు ఉపాధ్యక్షులు, ఒక జనరల్ సెక్రటరీ, ముగ్గురు జాయింట్ సెక్రటరీలు, ఒక ట్రెజరర్, ఒక జేసీసీ మెంబర్, మూడు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, నాలుగు స్టేట్ కౌన్సిలర్స్, ఆరుగురు ఈసీ మెంబర్ల పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా పరిషత్ పరిధిలో రికార్డు అసిస్టెంట్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్ వరకు విధులు నిర్వర్తించే 124 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లా పరిషత్ విభజన అయిన తర్వాత హనుమకొండ జిల్లా (వరంగల్ అర్బన్)కు మొట్టమొదటి సారిగా జరుగుతున్న ఈ ఎన్నికలు హోరాహోరీగా జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ప్రధాన పోస్టులతో పాటు స్టేట్ కౌన్సిల్ పోస్టులకు భారీగా పోటీ ఉంటుందనే ప్రచారం జరుగుతున్నది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, VADEKARI MADHUKAR S/O BALAIAH (Old Name) R/o Mallakapet, Mdl:Parkal, Hanamkonda Dist. TS., have changed my name as VADIKARI MADHUKAR S/o BALAIAH (New Name). For all my future purposes.

అమ్మబడును.

★హనుమకొండ చౌరస్తా మహేంద్ర క్లాత్ షోరూం ప్రక్కన గల్లీలో SSN Reddy కాంప్లెక్స్ నందు 1st ఫ్లోర్‌లో 3 కమర్షియల్ షట్టర్స్ అమ్మకానికి కలవు. సంప్ర|| సెల్: 8686778662.
NTW-00000

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

DASARA OFFER

★Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516.
NT-333073

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565